ఏసుక్రీస్తు బోధనలు

మానవాళికి మార్గదర్శకం

సీఎం రేవంత్‌రెడ్డి

క్రిస్మస్ శుభాకాంక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి క్రిస్టియన్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఏసు క్రీస్తు బోధనలు ఇప్పటికీ, ఎప్పటికీ ప్రపంచంలోని మానవాళికి మార్గదర్శకమని అన్నారు. అన్ని మతాల సారాంశం మానవత్వమేనని, ఆయన ఎంచుకున్న మార్గం అందరికీ దిక్సూచిగా నిలుస్తున్నదని కొనియాడారు. ఇతరులపై ప్రేమ, సహనం, శాంతి, సేవాభావం వంటి గొప్ప గుణాలను ఆచరించాలని శాంతి దూత ఇచ్చిన సందేశం మనందరికీ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఏసు బోధనలు అనుసరించి అన్నిమతాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో కదలిక

- వైస్ చైర్‌పర్సన్‌గా శైలజారామయ్యర్
- ఆలస్యంగానైనామంచి నిర్ణయం : రమణాచారి

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : సంవత్సరం నుంచి స్తబ్ధుగా ఉన్న బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో కదలిక వచ్చింది. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్‌ను పరిషత్ వైస్ చైర్‌పర్సన్‌గా నియమించడంతోపాటు ఆమెకు చెక్‌పవర్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో బ్రాహ్మణ సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. బీఆర్ఎస్ సర్కారు 2017లో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను ఏర్పాటుచేయడంతోపాటు పేద బ్రాహ్మణుల సంక్షేమానికి అనేక పథకాలు అమలుచేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక అవన్నీ నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో వైస్ చైర్‌పర్సన్ నియామకంతో పరిషత్ కార్యకలాపాలు కొనసాగే అవకాశం ఉన్నదని బ్రాహ్మణ సంఘాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా బ్రాహ్మణ పరిషత్ మాజీ చైర్మన్ రమణాచారి మాట్లాడుతూ.. ఆలస్యంగానైనా నిర్ణయం తీసుకున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో గత ఏడాది బెస్ట్, విదేశీ విద్యా పథకాలకు ఎంపికైన వారికి లబ్ధి చేకూరుతుందనే ఆశాభావం వ్యక్తంచేశారు.

‘నమస్తే’లో కథనం..అధికారుల్లో చలనం

- ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు రెవెన్యూ అధికారుల చర్యలు
- స్థలం నుంచి ఖాళీచేసి వెళ్లిపోయిన ప్రైవేటు వ్యక్తులు
- జలమండలి స్థలంలో విజిలెన్స్ అధికారుల నిఘా
- స్థలంలోకి వస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరిక

ప్రభుత్వ స్థలం లోపలి భాగంలో ప్రైవేటు వ్యక్తులు ఖాళీ చేసిన దృశ్యం

బంజారాహిల్స్,డిసెంబర్ 24: బంజారాహిల్స్‌లో సుమారు ఐదెకరాల ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలపై ‘నమస్తే తెలంగాణ’ వరుస కథనాలు ప్రచురించడంతో అధికారుల్లో చలనం మొదలైంది. షేక్‌పేట మండలం సర్వే నంబర్ 403/పీ పరిధిలోకి వచ్చే బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో సుమారు 5 ఎకరాల స్థలంలో పార్థసారథి అనే వ్యక్తి తిష్టవేశాడని, బోగస్ పత్రాలతో ప్రభుత్వ విభాగాలను తప్పుదోవ పట్టిస్తూ స్థలాన్ని కాజేసేందుకు యత్నిస్తున్నాడంటూ ‘నమస్తే’ ప్రచురించిన కథనాలతో కలకలం రేగింది. ఢిల్లీ పెద్దలతో పరిచయాలు ఉన్నాయని రెవెన్యూ అధికారులను బెదిరిస్తూ స్థలాన్ని ఆక్రమించే యత్నం ఈ కథనాలతో వెలుగు చూసింది. వరుస కథనాలతో అప్రమత్తమైన అధికారులు సోమవారం తెల్లవారుజామునే ఆ స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గతంలోనూ రెండు మూడుసార్లు ఏర్పాటు చేసినా పార్థసారథి అనుచరులు వాటిని తొలగించిన విషయాన్ని కూడా ‘నమస్తే’ తన కథనంలో పేర్కొంది. దీంతో షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి మంగళవారం క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు. రోజూ రెండుగంటలకోసారి ప్రభుత్వ స్థలంలోకి వెళ్లి నిఘా పెట్టాలని, ప్రైవేటు వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో మంగళవారం ఉదయాన్నే వారు అక్కడికి వెళ్లి ప్రైవేటు వ్యక్తులను హెచ్చరించడంతో అక్కడున్న ఆరుగురు వెళ్లిపోయారు. అక్కడున్న వంట సామగ్రి, వాటర్ డ్రమ్ములను తొలగించారు. ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారి పార్థసారథి కుమారుడి సూచనలతోనే వారు అక్కడ తిష్టవేసినట్టు తెలిసింది. ఈ స్థలంతో పార్థసారథికి ఎలాంటి సంబంధం లేకున్నా బోగస్ పత్రాలతో ఏమార్చే ప్రయత్నం చేసినట్టు సమాచారం. పాతబస్తీకి చెందిన రౌడీషీటర్లను ఉపయోగించుకుని స్థానికంగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్టు సమాచారం. కబ్జాకు పాల్పడిన నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విజిలెన్స్ విభాగం నిఘాలో జలమండలి స్థలం

పార్థసారథి ఆక్రమణలో ఇప్పటిదాకా ఉన్న జలమండలికి కేటాయించిన 1.2 ఎకరాల స్థలాన్ని రక్షించుకోవడంలో ఏ మాత్రం అలసత్వం వహించినా తీవ్ర చర్యలు తప్పవని ఈ నెల 20న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో సోమవారం నుంచి జలమండలి విజిలెన్స్ విభాగం తరపున నిఘా ఏర్పాటు చేశారు. ఇద్దరు కానిస్టేబుళ్లను జలమండలి స్థలంలో విధుల్లో నియమించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యక్తులు జలమండలి స్థలంలో రాకుండా చూడాలని, ఒకవేళ ఎవరైనా స్థలంలోకి వస్తే వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని అదేశించారు.

ప్రభుత్వస్థలంలోకి వస్తే క్రిమినల్ చర్యలు: అనితారెడ్డి

బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో షేక్‌పేట మండలం సర్వే నంబర్ 403/పీలో ఉన్న స్థలం ప్రభుత్వానిదేనని, దీనిలో 1.2 ఎకరాల స్థలాన్ని జలమండలికి కేటాయించగా మిగిలిన స్థలంలోకి అక్రమంగా ఎవరు ప్రవేశించినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి హెచ్చరించారు. స్థలంలోకి ప్రైవేటు వ్యక్తులు రాకుండా చూడాలని ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని, ప్రతి రెండుగంటలకు ఒక సారి స్థలాన్ని పరిశీలించి తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు.

‘రక్షణ శాఖ మంత్రి అమిత్ షా’ అని ఉన్న ఫ్లెక్సీని పట్టుకొని కాంగ్రెస్ నిరసన ర్యాలీలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల

అమిత్‌షా.. కేంద్ర రక్షణ శాఖ మంత్రట !

- ఖమ్మం నగరంలో నవ్వులపాలైన కాంగ్రెస్ నిరసన ప్రదర్శన
- అదే ఫ్లెక్సీని పట్టుకొని ర్యాలీ చేసిన భట్టి, తుమ్మల

ఖమ్మం, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు ఖమ్మంలో మంగళవారం నిర్వహించిన నిరసన ర్యాలీ నవ్వులపాలైంది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు ఫ్లెక్సీని పట్టుకొని ర్యాలీ అగ్రభాగాన నడిచారు. ఆ ఫ్లెక్సీలో ‘కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా’ అని కాకుండా ‘కేంద్ర రక్షణ శాఖ మంత్రి అమిత్‌షా’ అని ఉంది. అయినా అదే ఫ్లెక్సీ పట్టుకొని వారు ప్రదర్శన చేస్తుండడాన్ని చూసి నగర ప్రజలు నవ్వుకున్నారు. ప్రభుత్వంలో కీలక హోదాల్లో ఉన్న భట్టి, తుమ్మల వంటి వారు తాము పట్టుకున్న ఫ్లెక్సీలో కేంద్ర మంత్రి హోదా తప్పుగాఉన్నా పరిశీలించకపోవడం ఏమిటంటూ వ్యాఖ్యానించారు. ఈ అంశం సోషల్ మీడియా, ఇతర ప్రసార మాధ్యమాల్లో ట్రోల్ అవుతున్నది.

టీవీ లైవ్‌లో కాంగ్రెస్ నేత దాదాగిరి

మొదటిపేజీ తరువాయి...

జరుగుతుండగా రెడ్డి శ్రీనివాస్ పదేపదే ఫోన్‌చేసి మరీ ఓపెన్‌గా బెదిరించాడు. ‘నీ సంగతి తెలుసు. వేస్ట్‌పర్సన్‌వు నువ్వు. నీ వల్ల వచ్చిందేంది? పోయిందేంది? నా పేరు ఎందుకు తీసినవ్.. ఏమనుకుంటున్నవ్.. నీకు తెలివి ఉండొచ్చు.. అబద్ధాలు మాట్లాడకు.. నీకు తెలివి ఉన్నదని, హిందీ, ఇంగ్లిష్ వచ్చని మాట్లాడుతున్నవ్.. రెచ్చిపోతున్నవ్.. డోంట్ యాక్ట్ ప్లే. నేను ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖలో పీహెచ్‌డీ స్కాలర్‌ను. నిజాలు మాట్లాడు. నువ్వు బీఆర్ఎస్ బ్రోకర్‌వు. నువ్వు మా గురించి మాట్లాడుతున్నవా?’ అని శ్రీనివాస్ తిట్ల దండకం అందుకున్నాడు. ‘నన్ను ఎందుకు బెదిరిస్తున్నవ్? అల్లు అర్జున్ ఇంటిపై ఎందుకు దాడి చేశావ్.. నువ్వే దాడి చేశావా? లేదా ఎవరైనా దాడి చేయమన్నారా?’ అని క్రిశాంక్ ప్రశ్నించగా సమాధానం చెప్పకపోగా.. హిందీ, ఇంగ్లిష్ తెలుసు కానీ, తెలుగులోనే మాట్లాడు అంటూ శ్రీనివాస్ బెదిరింపులకు పాల్పడ్డాడు. పక్కనే ఉన్న ఆర్నబ్ గోస్వామి స్పందిస్తూ లైవ్ లింక్ పెడతాను.. నేరుగా

మాట్లాడాలని సూచించారు. అయినా, రెడ్డి శ్రీనివాస్ తిట్టడం ఆపలేదు. కాగా, మధ్యాహ్నం ఒకసారి క్రిశాంక్‌కు ఫోన్ చేసిన రెడ్డి శ్రీనివాస్ బెదిరించాడు. అప్పుడు క్రిశాంక్ ఆ ఫోన్ కట్ చేశారు. ఆ తర్వాత రాత్రి 9 గంటల సమయంలో రిపబ్లిక్ టీవీ లైవ్ డిబేట్‌లో ఉండగా మరోసారి ఫోన్ చేసిన రెడ్డి శ్రీనివాస్ బెదిరింపులకు దిగాడు. దీంతో కట్ చేయడంతో మరోమారు ఫోన్ చేశారు. దీంతో కలగజేసుకున్న ఆర్నాబ్ లౌడ్ స్పీకర్ ఆన్ చేయమనడంతో బెదిరింపుల విషయం బయటపడింది.

కాంగ్రెస్ సర్కారు వైఖరిపై చర్చ

లైవ్‌లో మాట్లాడుతున్న వ్యక్తికి కాంగ్రెస్ నాయకుడు నేరుగా ఫోన్ చేసిన బెదిరించిన ఘటన జాతీయ స్థాయిలో వివాదాస్పదమైంది. ఆర్నాబ్ సైతం కాంగ్రెస్ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. లైవ్‌లో జాతీయ స్థాయి అధికార ప్రతినిధిని ఓ కేసులో ప్రధాన నిందితుడైన వ్యక్తి బెదిరించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ బెదిరింపులు స్వయంగా విన్న ఆర్నాబ్ స్పీకర్ ఆన్ చేయమని క్రిశాంక్ కోరారు. దీంతో రెడ్డి శ్రీనివాస్ బెదిరింపులను లైవ్‌లో ఉన్న అందరూ విన్నారు. ఈ బెదిరింపులపై సర్వ త్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి చర్యలు ఎంతమాత్రమూ సమర్థనీయం కాదని అంటున్నారు. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కామేశ్వరాలయ పునర్నిర్మాణానికి మోక్షం

సాయిల్ టెస్ట్ పనులు ప్రారంభం

వెంకటాపూర్, డిసెంబర్ 24: ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట లోని రామప్ప దేవాలయ ప్రాంగణంలోగల కామేశ్వరాలయ పునర్నిర్మాణం కోసం సాయిల్ టెస్ట్ కోసం పనులు ప్రారంభించారు. కామేశ్వరాలయం పునర్నిర్మాణంతో పాటు, ప్రసాద్ ప్రాజెక్ట్ పనుల కోసం 2022లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కామేశ్వరాలయ పునర్నిర్మాణం కోసం రూ.11 కోట్ల నిధులు కేటాయించారు. గత వేసవిలో పూర్తిగా కామేశ్వరాలయ రాళ్లను, ఇసుకను తొలగించగా వర్షాకాలంలో పనులు నిలిచిపోయాయి. మంగళవారం ప్లేట్ లోడ్ టెస్ట్ కోసం ఏర్పాట్లు చేశారు.

అమిత్ షా వ్యాఖ్యలపై ప్రధాని స్పందించరా?

అంబేద్కర్‌ను అవమానించడాన్ని ఖండిస్తున్నాం: రాఘవులు

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తేతెలంగాణ): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవమానించేలా మాట్లాడినా ప్రధాని మోదీ మాత్రం ఇప్పటికీ నోరువిప్పడం లేదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు విమర్శించారు. అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ 30న దేశ వ్యాప్త నిరసన చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికైనా అమిత్ షా క్షమాపణలు చెప్పాలని, లేకుంటే ఆయనను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, చుక్క రాములు, జ్యోతితో కలిసి సీపీఎం 4వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను రాఘవులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ‘ఒకే దేశం-ఒకే ఎన్నిక’ బిల్లు చాలా ప్రమాదకరమైనదని, ప్రాంతీయ పార్టీలకు గొడ్డలి పెట్టు అవుతుందని తెలిపారు.

డైవర్షన్ పాలిటిక్స్ ప్రభుత్వానికి మంచిది కాదు: తమ్మినేని

హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ కాలయాపన చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. డైవర్షన్ పాలిటిక్స్ మంచిది కాదని తెలిపారు. రుణమాఫీ పూర్తికాలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుకు నోచుకోలేదని, రైతు భరోసాను అమలు చేయాలని, కౌలు రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర మహాసభలు జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

పూరిగుడిసె ఉన్నోళ్లకే తొలి విడత ఇండ్లు

- కేంద్రం సాయంతో ఇందిరమ్మ ఇండ్లు
- మంజూరుకోసం 80 లక్షల దరఖాస్తులు
- గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ): ఇంటిజాగ ఉండి పూరి గుడిసెలు, కచ్చ ఇండ్లు ఉన్నవారికే తొలి విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. వికలాంగులు, వితంతువులు, తదితర నిరుపేదలకు మాత్రమే తొలి విడతలో ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం గృహనిర్మాణ సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థికసాయంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ బ్రాండింగ్ వేసేందుకు తమకు ఎటువంటి భేషజాలు లేవని తెలిపారు. కేంద్రం యాప్ ద్వారా ఎంపికకాని నిరుపేదలు ఎవరైనా ఉంటే వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇండ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. ఇండ్ల మంజూరుకోసం 80 లక్షల దరఖాస్తులు వచ్చాయని, శాస్త్రీయ పద్ధతుల్లో, అత్యంత పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని చెప్పారు. ఇప్పటివరకు 32 లక్షల దరఖాస్తుదారుల వివరాలను సేకరించగా, తొలివిడతలో 4.5 లక్షల ఇండ్లు నిర్మించనున్నట్టు తెలిపారు. వచ్చే నాలుగేండ్లలో 20 లక్షల ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది జనవరి మొదటి వారంకల్లా మొత్తం 80 లక్షలమంది దరఖాస్తుదారుల వివరాలను సేకరిస్తామని, ఇప్పటికే జిల్లాల వారీగా ప్రాజక్టు డైరెక్టర్లను నియమించామని వివరించారు. ఎంపికైనవారికి నాలుగు విడతల్లో రూ.5 లక్షలను చెల్లిస్తామని చెప్పారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన విధివిధానాలను త్వరలోనే వెల్లడిస్తామని, ఫిర్యాదుల స్వీకరణకు ఒకటి రెండు రోజుల్లో వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తామని, త్వరలో టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెస్తామని తెలిపారు. గతంలో నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా ఉన్న ఇండ్లను కూడా పూర్తిచేస్తామని చెప్పారు. ఇల్లు పొందేందుకు రేషన్‌కార్డుతో పనిలేదని, యాప్‌లో నమోదుచేసిన వివరాలు, గ్రామసభల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని చెప్పారు.

మధ్యతరగతి వాళ్లకూ ఇండ్లు నిర్మిస్తాం

నగరానికి నలువైపులా సుమారు 100 ఎకరాలకు తగ్గకుండా భూములను గుర్తించి అల్పాదాయ, మధ్య తరగతి వర్గాలకు కూడా ఇండ్లు నిర్మించే యోచన ఉన్నదని మంత్రి పొంగులేటి తెలిపారు. గతంలో మాదిరిగా ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ గృహాలను నిర్మిస్తామని చెప్పారు. దిల్ (డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్) ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టుల బకాయి చెల్లించకపోతే ఆ ఆస్తులను స్వాధీనం చేసుకొని వేలం నిర్వహిస్తామని మంత్రి హెచ్చరించారు. ఇప్పటికే గ్రామాల వారీగా రెవెన్యూ అధికారుల నియామకానికి నిర్ణయం తీసుకున్నామని, త్వరలో 1,200 మంది వరకు సర్వేయర్లను కూడా నియమిస్తామని మంత్రి ప్రకటించారు.

జర్నలిస్టులకూ ఇండ్లు

రాజీవ్ స్వగృహ ఇండ్లను జర్నలిస్టులకు ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. మిగిలిన ఇండ్లను వేలం వేసేందుకు హౌసింగ్ బోర్డు ప్రయత్నిస్తున్నదని, వాటిని జర్నలిస్టులకు కేటాయించాలని కొందరి కోరిక మేరకు మంత్రి స్పందించారు. ధరను నిర్ధారించి కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్రైమ్‌రేట్‌లో సై'బర్‌బాద్'!

మొదటిపేజీ తరువాయి...

సమావేశంలో 2024 వార్షిక నివేదిక విడుదల చేశారు. దీని ప్రకారం నేరాల పెరుగుదల విషయంలో ట్రై పోలీస్ కమిషనరేట్లలో సైబరాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు ఇప్పటికే 2024 వార్షిక నివేదికను విడుదల చేశారు. నివేదిక విడుదల అనంతరం అవినాష్ మహంతి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతోనే సైబరాబాద్‌లో కేసుల సంఖ్య పెరిగినట్టు చెప్పారు. సైబర్ నేరాలతోపాటు ఆస్తుల గొడవలు, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, సాధారణ దాడులు, ట్రెస్‌పాస్, వరకట్న వేధింపులు కూడా పెరిగినట్టు తెలిపారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగినా వాటిలో మరణాల సంఖ్య తగ్గినట్టు తెలిపారు. ఆర్థిక నేరాలకు సంబంధించిన మోసాల కేసుల్లో దర్యాప్తు కోసం ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశామని, దీనికి ఈ ఏడాది మార్చి వరకు 90 కేసులు నమోదైనట్టు వివరించారు. ఇక, సైబర్ నేరాల కారణంగా 2023లో రూ. 269 కోట్ల నష్టం వాటిల్లగా, 2024లో నవంబర్ వరకు రూ. 793 కోట్ల నష్టం జరిగింది. ఇందులో రూ. 70,46, 11,458ను బాధితులకు తిరిగి చెల్లించారు. ప్రధానంగా పార్ట్‌టైమ్ జాబ్స్, ట్రేడింగ్, స్మిషింగ్ నేరాలు అధికంగా జరిగాయి. 2023లో 102 డిజిటల్ అరెస్ట్‌లు నమోదు కాగా, ఈ ఏడాది వాటి సంఖ్య 1002కు పెరిగింది.

కొన్ని స్పష్టం... మరికొన్ని అస్పష్టం

సైబరాబాద్ పోలీసులు విడుదల చేసిన వార్షిక నివేదికలో పేర్కొన్న కొన్ని నేరాల వివరాలు అస్పష్టంగా ఉన్నాయి. హత్యలు, దోపిడీలు, దొంగతనాలకు సంబంధించి వివరాలను పొందపర్చలేదు. 2024లో 10 రకాలైన గ్రేవ్ కేసులకు సంబంధించిన డిటెక్షన్ వివరాలను మాత్రం వెల్లడించారు. ఇందులో 2024 వివరాలు మాత్రమే ఉన్నాయి. సైబర్‌క్రైమ్, ట్రాఫిక్, ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లకు సంబంధించిన కేసుల వివరాలను స్పష్టంగా వెల్లడించిన పోలీసులు, కొన్ని గ్రేవ్ కేసుల్లో మాత్రం దాగుడుమూతలు ఆడినట్టు ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి. ‘ఫిర్యాదులు వచ్చాయి, కేసులు నమోదు చేస్తున్నాం. కేసులను బట్టి నేరాలు పెరుగుతున్నాయనుకోవడం సరికాదు. ఫిర్యాదులపే నమోదు చేస్తుండటంతో ఎఫ్ఐఆర్‌ల సంఖ్య పెరుగుతున్నది’అని సీపీ వివరించారు.

సైబర్ నేరాల పెరుగుదల ఇలా..

సంవత్సరం	సంఖ్య
2022	4866
2023	5361
2024	11914

ప్రధాన కేసుల వివరాలు

నేరం	కేసుల సంఖ్య	నష్టపోయిన మొత్తం (రూ.)
పార్ట్‌టైమ్ జాబ్	3,267	173,66,16,260
ట్రేడింగ్ ఫ్రాడ్	1,686	338,45,26,842
స్మిషింగ్ ఫ్రాడ్	1,276	18,78,06,029
డిజిటల్ అరెస్ట్	1,002	80,57,06,754

నేరాల వివరాలు ఇలా..

నేరం	2023	2024
ప్రాపర్టీ అఫెన్సెస్	2,904	4,681
ఆర్థిక నేరాలు	1,551	2,140
సాధారణ దాడులు(సింపుల్ హర్ట్స్)	1,396	1,963
క్రిమినల్ ట్రెస్‌పాస్	1,034	1,429
రోడ్డు ప్రమాదాలు	2,224	3,024
వరకట్న వేధింపులు	1,030	1,343
సైబర్ క్రైం	5,361	11,914

పూల రవీందర్‌కు టీఎంఎస్‌టీపీ మద్దతు

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ, వరంగల్, ఖమ్మం నియోజకవర్గం నుంచి టీచర్ ఎమ్మెల్సీగా బరిలో ఉన్న పూల రవీందర్‌కు తెలంగాణ మాడల్ స్కూ ల్ టీచర్స్ అసోసియేషన్ (టీఎంఎస్‌టీపీ) మద్దతు పలికింది. రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు పూల రవీందర్‌ను కలిసి మద్దతు లేఖను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంతం నగేశ్, సహ అధ్యక్షుడు ధనుంజయ్, రవీందర్‌గౌడ్, ఆంజనేయులు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఉపాధ్యాయుడు

- అయ్యప్ప భక్తుడిపై చిందులు
- ములుగు జిల్లా కొండాయి గిరిజన పాఠశాలలో ఘటన

ఏటూరునాగారం, డిసెంబర్ 24 : ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు మద్యం తాగి విధులకు హాజరై అయ్యప్ప భక్తుడిపై చిందులేసిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. గ్రామంలో ఫోన్ సిగ్నల్ సరిగా లేకపోవడంతో మంగళవారం సదరు భక్తుడు అక్కడి పాఠశాల భవనంపైకి వెళ్తున్న క్రమంలో మద్యం తాగి ఉన్న ఓ ఉపాధ్యాయుడు దురుసుగా ప్రవర్తించాడు. ఉపాధ్యాయుడి వీరంగాన్ని అయ్యప్ప భక్తుడు ఫోన్‌లో వీడియో తీశాడు. వీడియో ఎందుకు తీస్తున్నావంటూ ఉపాధ్యాయుడు మొబైల్‌పై కొట్టడంతో కింద పడిపోయింది. ఇటీవల ఎస్ఎస్ఎఫ్ఐ విద్యార్థులు సైతం కొండాయిలో ఓ ఉపాధ్యాయుడు మద్యం తాగి విధులకు హాజరవుతున్నాడంటూ ఆరోపించిన విషయం తెలిసిందే.

27 నుంచి మ్యూజిక్ టీచర్ల డెమో

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో మ్యూజిక్ టీచర్ల భర్తీకి 27, 28,30 తేదీల్లో డెమో నిర్వహిస్తున్నట్టు ట్రిబ్ చైర్మన్ సైదులు తెలిపారు. మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మాసాబ్‌ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో రోజూ రెండు సెషన్స్‌లో అభ్యర్థులకు డెమో నిర్వహిస్తామని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు ట్రిబ్ వెబ్‌సైట్‌లో తమ షెడ్యూల్‌ను పరిశీలించుకోవాలని, ఆయా తేదీల్లో హాజరు కావాలని సూచించారు.

అర్హులనే సర్వేయర్లుగా నియమించండి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి నిరుద్యోగుల విజ్ఞప్తి

సచివాలయంలో మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందిస్తున్న నిరుద్యోగులు

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): డిప్యూటీ సర్వేయర్ పోస్టులను పాత వీఆర్వోలు, వీఆర్ఏల ద్వారా భర్తీ చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుండటాన్ని నిరుద్యోగులు ఖండించారు. మంగళవారం వారు సచివాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఇంటర్, డిగ్రీ అర్హత ఉన్న పాత వీఆర్వోలు, వీఆర్ఏలను సర్వేయర్ పోస్టుల్లో నియమించాలని ప్రభుత్వం నిర్ణయించడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. 2017 నోటిఫికేషన్ ప్రకారం